హామీల అమలులో విఫలం

మాయమాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్

- రైతులను దగా చేసిన ప్రభుత్వం
- ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు
- బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు
- పార్టీ పిలుపుమేరకు నిరసనలు



కడ్తాల్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా



ఆమనగల్లు: సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి: ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ ఆరోపించారు. వానాకాలం రైతుభరోసాను ఇవ్వకుండా రైతులను దగాచేసిందని, వెంటనే భరోసాతో పాటు, అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను వందశాతం అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం పట్టణంలో పార్టీ శ్రేణులు ధర్నా చేశారు. రాజీవ్‌చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, రమేశ్, యాదయ్య, గుత్తి బాలస్వామి, శివకుమార్, హేమ్లానాయక్, సాయిలు, సైదులు, గణేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

అమలు సాధ్యంకాని హామీలతో..

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని బీఆర్ఎస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పరమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్ ఆరోపించారు. అమలు సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నది రేవంత్ కాదని, ఆరు గ్యారంటీల ఎగవేత దారుడు అని అభివర్ణించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ.. మండల కేంద్రంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుర్చీ కోసం దొంగచాటున కాంగ్రెస్ అధికారంలో వచ్చిందని, ప్రజలు కష్టాలు పడుతుంటే.. ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందని మండిపడ్డారు.

రైతుభరోసా ఏదీ?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుబంధు రెండు పంటలకు కాదు మూడు పంటలకు ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఒక్క పంటకు కూడా రైతుభరోసా ఇవ్వలేని దుస్థితిలో పాలన సాగిస్తున్నారని నేతలు విమర్శించారు. రేవంత్ పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పటం ఖాయమని హెచ్చరించారు. మాజీ వైస్ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిద్, తులసిరాం, కృష్ణయ్య, నర్సింహగౌడ్ నాయకులు వీరయ్య, చంద్రమౌళి, మహేశ్, హెచ్ఆర్ మహేశ్, నర్సింహ, అంజి, కృష్ణ ఉన్నారు.

రైతుభరోసా ఎగవేత



తలకొండపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వానకాలం రైతుభరోసాను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. పార్టీ పిలుపుమేరకు తలకొండపల్లి మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ముజిబర్ రహ్మాన్‌ల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని విమర్శించారు. రుణమాఫీ చాలదన్నట్లు.. ఇప్పుడు రైతుభరోసా ఎగవేసిందని, ఎకరాకు రూ.15 వేల భరోసా ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, లేని పక్షంలో ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, మల్లేశ్, ఆంజనేయులు, యాదయ్య, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం అవురుపల్లి మాజీ సర్పంచ్ అలివేలు హరిమోహన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి స్థానిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీల నిర్మాణం, ప్రాథమిక ఆస్పత్రి, జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ పనుల నిమిత్తం నిధులు కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ బాలమోని వెంకటయ్య గౌడ్, నాయకులు గౌని వెంకటయ్య గౌడ్, కృష్ణయ్య, రఘు కిషోర్‌రెడ్డి, రంగారావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య పిచ్చి మొక్కలను తొలగించండి

కడ్తాల్: నివాసాల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రాంత ప్రజలు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని 2,3 వార్డుల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయని చెప్పారు. చెట్ల పొదలు మూగ జీవాలకు ఆవాసంగా మారాయని, దోమలు, ఈగలు పెరిగాయని పేర్కొన్నారు. విష సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకుని, చీదును తొలగించాలని స్థానిక నాయకుడు అంజి, ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎంపీ మల్లురవికి స్వాగతం



ఎంపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఎంపీ డాక్టర్ మల్లురవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలకు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురిని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, గుర్రం కేశవులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, మానయ్య, శ్రీనునాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేడు మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

మహాసభలను జయప్రదం చేయండి

మాడ్గుల: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యురాలు మల్ల సైదమ్మ పిలుపునిచ్చారు. అదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు జాతీయ, ప్రాంతీయ నాయకులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

నవంబర్ 3న డీఎస్‌పీ మహాసమ్మేళనం

ఆమనగల్లు: ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనం నవంబర్ 3న హైదరాబాద్ ఆదిబట్ల కేబీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కో కన్వీనర్ రమేశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మేళనం పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. డీఎస్పీతోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బలరాం, నాయకులు ప్రవీణ్, యాదగిరి, సురేశ్, వంశీ, మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఆలయంలో కొలువైన కన్యకాపరమేశ్వరి

యాచారం: వాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. మండల పరిధి నందివనపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హోమాలు నిర్వహించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ రైతు, సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆలయం గొప్ప పుణ్యక్షేత్రంగా మారబోతుందన్నారు. కార్యక్రమంలో రమణానందస్వామి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉదయశ్రీ, వెంకట్‌రెడ్డి, రామనాథం, విజయనాథ్, గోపి, యాదయ్య, జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

తుర్కయంజాల్: వ్యవస్థలో దోపిడీ, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు ఉన్నంతకాలం ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ తుర్కయంజాల్ సెంటర్ కార్యదర్శిగా అరుణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. ఆ పార్టీ మున్సిపల్ కన్వీనర్ కిషన్, నాయకులు సత్యనారాయణ, శంకర్, ఆశీర్వాదం, వెంకటకృష్ణ, శ్రీరామ్ మూర్తి, శ్రీధర్, జగన్ ఉన్నారు.

కసిరెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

- అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న ఎమ్మెల్యే
- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థత వలనే నియోజకవర్గం వెనుకబాటుకు గురైందని విమర్శించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. కల్వకుర్తిపై ఉన్న ప్రేమతోనే ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా రోడ్ల నిర్మాణం కోసం రూ.204 కోట్లు మంజూరు చేశారని చెప్పారు.

కృష్ణా సాగుజలాలు తెచ్చింది కసిరెడ్డే..

అధికారం దక్కలేదనే అక్కసుతో మాజీ ఎమ్మెల్యే జైపాల్.. ఎమ్మెల్యే కసిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన జైపాల్.. కానిస్టెన్సీకి చేసిందేమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే మాడ్గుల మండలం వరకు కృష్ణా సాగుజలాలు అందించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బిక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, తలకొండపల్లి అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మానయ్య ఉన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక, సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కులగణన పూర్తి చేసి, ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీ కార్యదర్శిగా శ్రీరాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు చందునాయక్, తావునాయక్, జంగయ్య, రవి, కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

లోయపల్లిలో కుక్కల బెడద



వీధిలో కుక్కల సంచారం

మంచాల: వీధి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మండల పరిధి లోయపల్లిలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయని, ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి, గాయపర్చాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఒకటో వార్డులో శునకాలు అధికంగా ఉన్నాయని, అకారణంగా మీదకు ఎగబడుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కుక్కలను గ్రామం నుంచి తరలించాలని కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యాచారం: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 విద్యాసంవత్సరం పదో తరగతి బాల్య మిత్రులు నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా ఆదివారం సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బాషా, ఉపేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.